క్లుప్తంగా

నియామకం

తిరుమలాయపాలెం: కేవీపీఎస్ మండల కార్యదర్శిగా మండలంలోని పిండిప్రోలుకు చెందిన నాగటి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తిరుమలాయపాలెంలో జరిగిన సభలో ఈ ఎన్నిక నిర్వహించగా.. సంఘం అధ్యక్షుడిగా సోమపొంగు రాము, ఉపాధ్యక్షుడిగా పల్లి రమేష్, సహాయ కార్యదర్శిగా పుట్టల ఉపేందర్, ఉప్పలత, ఎల్లమ్మ, ప్రచార కార్యదర్శిగా మెంటం వెంకన్న, గోపోజు రవి, సభ్యులుగా కొమ్ము నాగేశ్వరరావు, ఎడ్ల ఉమేష్, పప్పుల ఉపేందర్, దాసరి మహేందర్, చిరంజీవితో పాటు 23 మందిని ఎన్నుకున్నారు.

పాఠశాలకు అన్ని అనుమతులు ఉన్నాయి..

ఖమ్మం సహకారనగర్: తమ పాఠశాలకు అన్నిరకాల అనుమతులు ఉన్నాయని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల బంద్ నేపథ్యాన వివిధ విద్యార్థి సంఘాల నుంచి తమ పాఠశాల అనుమతులపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అసత్యప్రచారాలు నమ్మొద్దని, కేం బ్రిడ్జి యూనివర్సిటీతో నాలెడ్జ్ పార్ట్‌నర్‌షిప్ సైతం తమకు ఉందని పేర్కొన్నారు. విలేఖరుల సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'రెజొనెన్స్ ఇన్ఫో'లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాలలో మంగళవారం మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ, శ్రీధర్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరగతి లీడర్, కో లీడర్ ఎంపికలో భాగంగా మాక్ పోలింగ్ రహస్య బ్యాలెట్ విధానంలో నిర్వహించామని, నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోపాలకృష్ణ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'అరవింద'లో మాన్‌సూన్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల అరవింద హైస్కూల్‌లో మంగళవారం మాన్‌సూన్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ అంజాద్ ఖాన్, డైరెక్టర్ గౌస్‌పాషా మహ్మద్, డీన్ నాగేశ్వరరావులు తెలిపారు. వర్షం వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు తెలియచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీనగర్ పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసి 10/10 జీపీఏ సాధించి బాసర ఐఐటీలో సీటు సాధించిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని పల్లవి చదువు కోసం లయన్స్ క్లబ్ ప్రతినిధులు మంగళవారం రూ. 5 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కల్వకుంట్ల గోపాల్‌రావు, కె.విశ్వేశ్వర రావు, బి.శ్రీనివాసరావు, ఆర్థి గోవిందరావు, ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలి

కూసుమంచి: మండలంలోని రాజుపేట గ్రామంలోని ఎస్సీలకు చెందిన అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని బీఎస్పీ ఆధ్వర్యాన మంగళవారం కూసుమంచి-సూర్యాపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బుర్రా ఉపేంద్ర సాహూ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి స్వగ్రామం అయిన రాజుపేటలో దశాబ్దాలుగా ఎస్సీల అధీనంలో ఉండి, పట్టాలు కలిగిన అసైన్డ్ భూముల్లో గ్రామ పంచాయతీ వారు మొక్కలు నాటించారని ఆరోపించారు. ఎమ్మెల్యే దీనిపై స్పందించకపోవడంతో రాజకీయ కుట్ర ఉందన్నారు. అధికారులు పట్టించుకోవటంలేదని మండిపడ్డారు. బీఎస్పీ బాధితుల పక్షాన అన్నివేళలా పోరాడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి నాగేశ్వరరావు, నాగరాజు, ఉపేందర్, విజయ్, మంజుల, రజిని, నాగేశ్వరరావు, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	నాయకుడు
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మిషన్ ఇంపాజిబుల్(తె)
శ్రీనివాస	మహావీరుడు

- ఖమ్మంగాంధీచౌక్

వైద్యం వర్రీ..!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

వైద్యులు లేక.. రోగుల ఇక్కట్లు

- 19 మంది వైద్యులకు ముగ్గురే నియామకం
- హై రిస్క్ మండలంగా అధికారుల ప్రకటన
- గతేడాది 140 డెంగీ కేసులు నమోదు
- ఫార్మసీ లేకపోవడంతో మందుల కోసం బయట దుకాణాలను ఆశ్రయిస్తున్న వైనం
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ

వైద్యరంగానికి పెద్దపీట వేస్తుందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ఏడాది నుంచి నేలకొండపల్లి ప్రభుత్వ దవాఖానాలో వైద్యుల కొరత వేధిస్తుండడంతో సకాలంలో వైద్యం అందక బాధితులు ప్రాణాలు కోల్పోవాల్సి పరిస్థితి నెలకొంది. అయినా పాలకులు, అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఆస్పత్రిని 2022 మార్చిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేసి వైద్య విధాన పరిషత్‌లోకి మార్చారు. అప్పటి నుంచి ఆస్పత్రికి జబ్బు చేసిందో ఏమో గానీ అందుకు తగ్గట్టుగా వైద్యులు, సిబ్బంది, పరికరాలు, కనీస సౌకర్యాలు లేక బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీహెచ్‌సీలు ఉన్నా.. మెరుగైన వైద్యం అందుతుందో లేదోనని ప్రజలు భయపడుతున్నారు.

పట్టించుకునే నాథుడే లేడు..

గతేడాది నేలకొండపల్లి మండలంలో 140 డెంగీ కేసులు నమోదు కావడంతో జిల్లా ఆరోగ్య శాఖలో హైరిస్క్ మండలంగా అధికారులు ప్రకటించారు. ఈనేపథ్యాన రాయగూడెంలో 10 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నా.. అధికారులు పట్టింపు కనిపించటం లేదు. కనీసం మెడికల్ ఆఫీసర్ ఉంటే కార్యక్రమాలు చేయడానికి అవకాశం ఉండేదని పలువురు భావిస్తున్నారు.

నిధులు కరువు..

నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఏడాదికి రూ.5 లక్షల చొప్పున కేటాయించాలి. కానీ, గతేడాది నుంచి సీహెచ్‌సీకి రూపాయి కూడా విదల్చడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న వైద్యులే తమ సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుంది. మందులు కూడా సరిపడా లేక దాదాపు 10 నుంచి 15 రకాల మందులు బయట దుకాణాలకు చిట్టీలు రాస్తున్నారు. సీహెచ్‌సీకి ప్రత్యేక ఫార్మసీ లేదంటే వైద్యశాఖకు నేలకొండపల్లి ఆస్పత్రిపై ఎంత నిర్లక్ష్యమో అర్థం చేసుకోవచ్చు. జబ్బు చేసి మూలుగుతున్న వైద్యశాలలకు చికిత్స చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

డిప్యూటేషన్‌పై ఇద్దరు..

సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో(పీహెచ్‌సీ) నలుగురు, సీహెచ్‌సీలో 15మంది మొత్తం 19 మంది వైద్యులు కావాల్సి ఉంది. అయితే ఇక్కడ పని చేస్తున్న వైద్యుడు ఆర్. శ్రావణ్‌కుమార్ సెలవుల్లో ఉండడంతో ఖమ్మం ప్రధాన ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్ కె.రాజేష్‌ను ఇక్కడకు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈనేపథ్యాన ప్రతీ రోజు దాదాపు 200 మందికి పైగా ఓపీలు ఉంటుండగా.. సదరు వైద్యుడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత నర్సులు, సిబ్బంది వైద్య సేవలు అందించాల్సి వస్తుండడంతో బాధితులు ఆస్పత్రికి రావాలంటేనే భయపడుతున్నారు. ఈమేరకు ప్రతిపక్షాలు వైద్యులు నియమించాలని ఆందోళన చేపట్టడంతో జిల్లా అధికారులు స్పందించి ఈనెల 15వ తేదీలోపు వైద్యులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యాన అధికారుల జాబితాలో ఉన్న పెనుబల్లి, మధిర, సత్తుపల్లి మండలాల్లో 10 మంది చొప్పున వైద్యులను నియమించింది. కానీ నేలకొండపల్లి మండలం ఇచ్చిన జాబితాలో లేకపోవడంతో ఎటువంటి నియామకాలు చేపట్టలేదు. కానీ మామిళ్లగూడెంలోని అర్బన్ ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న నాగమణి అనే వైద్యురాలిని డిప్యూటేషన్‌పై నేలకొండపల్లికి పంపించారు. ఇదిలా ఉండగా మంగళవారం గతంలో చేసిన వైద్యుడు ఆర్.శ్రావణ్‌కుమార్ విధుల్లో చేరడంతో ఆస్పత్రిలో ప్రస్తుతానికి ముగ్గురు వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఒక్కరు రెగ్యులర్ కాగా, మరో ఇద్దరు డిప్యూటేషన్‌పై వచ్చారు. వైద్యులు లేని ఆస్పత్రుల్లో నేలకొండపల్లి జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేష్

అధికారులు పట్టించుకోవాలి..



నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలపై అధికారులకు పలుమార్లు తెలియజేశా. చివరకు విసుగు చెంది అడగడం మానేశా. ప్రజల వైద్యం పట్ల అధికారుల తీరు బాగలేదు. కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇకనైనా అధికారులు పట్టించుకోవాలి.

– రాయపూడి నవీన్, సర్పంచ్, నేలకొండపల్లి

ప్రభుత్వం ఉందా.. లేదా..?



ప్రజల వైద్యం పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉండటం సిగ్గుచేటు. ఆందోళనలు చేసినప్పుడల్లా.. త్వరలోనే ఇస్తామని చెబుతామన్నారు. కానీ తీరు మారటం లేదు. దీన్ని బట్టి చూస్తే ప్రభుత్వం ఉందా? లేదా? అనే అనుమానం వస్తుంది. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం.

– బచ్చలకూరి నాగరాజు, కోరట్లగూడెం

ఇబ్బందైనా తప్పడం లేదు..



రెండు ఆస్పత్రుల్లో వైద్యులు లేకపోవడంతో ఓపీ చూడడం కష్టంగానే ఉంది. అయినా తప్పటం లేదు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లా. త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నా వంతు కృషి చేస్తున్నా.

– కె.రాజేష్, వైద్యులు, సీహెచ్‌సీ, నేలకొండపల్లి

మతిస్థిమితం లేని వ్యక్తికి రక్షణ



వినతి పత్రం ఇస్తున్న దిశా రక్షణ కమిటీ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని 56వ డివిజన్‌లో మతిస్థిమితం లేని 20 ఏళ్ల దేవరకొండ లక్ష్మణ్‌కు మంగళవారం జిల్లా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్, జిల్లా సంక్షేమాధికారి కృషితో రక్షణ కల్పించారు. మతిస్థిమితం లేని లక్ష్మణ్ తల్లి అచ్చమ్మ తన కొడుకును పోషించలేకపోతున్నానని రక్షణ కల్పించాలని దిశా రక్షణ కమిటీ అధ్యక్షురాలు కావేటి రేవతితో పాటు ఆ ప్రాంత వాసులను అభ్యర్థించింది. అభ్యర్థన మేరకు మహిళలు జిల్లా సంక్షేమాధికారి జి.జ్యోతిని కలిసి లక్ష్మణ్‌కు రక్షణ కల్పించాలని వినతి పత్రాన్ని అందించారు. దీంతో అన్నం ఫౌండేషన్‌లో లక్ష్మణ్‌ను చేర్పించారు. శృతి, మంజు, అరుణ, శ్రీదేవి, అరుణ, స్వప్న, ప్రమీల, సుందరి, సమీనా పాల్గొన్నారు.

అన్నదానం..



అన్నదానం చేస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: నూర్‌బాషా, దూదేకుల, ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం దివంగత మాజీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ గాలిబ్ సాహెబ్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ భాషా ఆధ్వర్యాన మదర్‌థెరిస్సా ఆశ్రమంలో వృద్ధులు, వికలాంగులకు అన్నదానం చేశారు. తొలుత కార్యాలయంలో గాలిబ్ సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీబేగం, జిల్లా అధ్యక్షురాలు షకినాబీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్‌రహీం, సీనియర్ నాయకులు షేక్ సైదులు, రహీం, ఫరీద్, షేక్ రసూల్, దర్గా సాహెబ్, నాసర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు

నేలకొండపల్లి: మిర్యాలగూడెం-డోర్నకల్ రైల్వేలైన్ మాకొద్దు అంటూ గ్రామపంచాయతీలు తీర్మానాలు చేశారు. మండలంలోని బోదులబండ, ఆచార్లగూడెం, నేలకొండపల్లి, కోనాయిగూడెం, ఆరెగూడెం, రామచంద్రాపురం, పైనంపల్లి గ్రామ పంచాయతీలు మంగళవారం తీర్మానాల పత్రాలను బాధిత రైతుల సంఘం ఆధ్వర్యాన ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావుకు అందించారు. రైల్వే లైన్ వలన స్థానికులు, రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, పైగా సన్న, చిన్న కారు రైతులకు తీరని నష్టం జరుగుతుందని బాధిత రైతు సంఘం ప్రతినిధులు వాపోయారు. పంచాయతీల వారీగా సమావేశాలు నిర్వహించారు. రైల్వే లైన్ మార్గం అలైన్మెంట్‌ను మార్చి ప్రత్యామ్నాయంను ఎంచుకోవాలని రైతుల కోరారు. ఈ మేరకు ఎంపీ నామా నాగేశ్వరరావుకు రైతుల గోడును పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు నెల్లూరి భరత్, అనంతు భాగ్యమ్మ, గడుపూడి పద్మ, కట్టెకోల నాగేశ్వరరావు, నాగేందర్, వట్టికూటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ మార్గాన్ని ఉపసంహరించుకోవాలి..



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో నూతన ప్రతిపాదిత రైల్వేలైన్ మార్గాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే లైన్ కింద భూములు కోల్పోయే రైతాంగం చేసే ఆందోళనకు సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. పోడు సాగుదారులు అందరికీ పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై ఈ నెల 31న హైదరాబాద్‌లో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, జిల్లా నాయకులు మారుతి మల్లయ్య, పాశం అప్పారావు, కేలోత్ లక్ష్మణ్, సత్యం పాల్గొన్నారు.

రైతులందరితో బీమా చేయించాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌చంద్ర

ఖమ్మంరూరల్: అర్హులైన ప్రతీ రైతుతో రైతు బీమా చేయించాలని కూసుమంచి ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. మంగళవారం పొన్నేకల్ రైతు వేదికలో డివిజన్‌లోని ఏఈలు, ఏఈఓలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా పాస్‌బుక్ పొందిన 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల రైతులందరూ వారి వారి క్లస్టర్లలోని ఏఈఓల వద్ద రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వానాకాలం 2023కి సంబంధించిన పంట నమోదు పక్కాగా నిర్వహించాలని, సర్వే నంబర్ల వారీగా ఏఏ పంటలు, ఏ నీటి వసతితో సాగుతున్నది.. తదితర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏఈఓలు ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి అన్ని రకాల రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం తీర్దాల పరిధిలోని గ్రామాల్లో పర్యటించి సాగుచేసిన పంటలను పరిశీలించారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని కలియదున్నుకుంటే కావాల్సిన పోషకాలు మొక్కలకు అందుతాయని తెలిపారు. నాలుగు మండలాల వ్యవసాధికారులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక గర్జన'ను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: కనీస వేతనాల ఐదు జీఓలను గెజిట్ చేయాలని, 68 షెడ్యూల్డ్ జీఓలు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 4న హైదరాబాద్ నిర్వహించే కార్మిక గర్జన జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జి.రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక గర్జన పోస్టర్లను స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చాలీచాలని జీతభత్యాలతో ఎలాంటి సామాజిక భద్రత లేని స్థితిలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కార్మిక గర్జనకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, పేరబోయిన వెంకన్న, బొమ్మకంటి రమేష్, జి.గరువయ్య, కాంతయ్య, మలుసూరు తదితరులు పాల్గొన్నారు.

18సీకేఎం245: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కందాల ఫౌండేషన్ ఆధ్వర్యాన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కుమార్తె దీప్తి మంగళవారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అదేవిధంగా వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీపీ మంగీలాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, ఉపాధ్యక్షుడు ఆర్మీ రవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్‌టీపీ కార్యాలయ నిర్మాణం

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి సమీపంలో నిర్మిస్తున్న వైఎస్సార్‌టీపీ కార్యాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కార్యాలయ నిర్మాణానికి వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల భూమి పూజ చేయగా.. మంగళవారం మొదటి అంతస్తు స్లాబ్ పనులకు పార్టీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి పూజలు చేశారు. కొద్ది రోజుల్లోనే పనులు పూర్తి చేసి షర్మిలచే ప్రారంభోత్సవం చేస్తారని ఆయన తెలిపారు.

'ప్రజల సొమ్మును కాజేస్తున్న ప్రభుత్వాలు'

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అవినీతికి పాల్పడుతూ ప్రజల సొమ్ము ఎక్కడికక్కడే దోచుకుంటున్నాయని ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. మంగళవారం ఖమ్మం శ్రీనగర్ కాలనీ ఆప్ కార్యాలయంలో నిర్వహిచిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆమ్ పార్టీపై అణచివేత ధోరణిలో వ్యవహరిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. 182 బీసీల్లో కేవలం 9 బీసీ కులాలకు బీసీ బంధు అరకొరగా అందించి మభ్య పెడుతుందని, దళిత బంధు కమీషన్లమయం అయిందని ఆరోపించారు. ఈ దేశంలో వనరులను ప్రజల కోసం వినియోగించే నైపుణ్యం ఆప్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఖమ్మం పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు, ఎం.సురేష్‌బాబు, మల్లేశ్, బాబులాల్ పవార్, రాంబాబు, అహ్మద్, గఫూర్, కల్పనా, లక్ష్మణ్‌నాయక్ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవానీ పండుగ



పాలేరులో వేడుకలు నిర్వహిస్తున్న గిరిజనులు

కూసుమంచి: గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా భవానీ పండుగ (దాటుడు పండుగ)ను మంగళవారం మండలంలోని పలు తాండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ పశువులకు రంగులు చల్లి వాటికి పూజలు చేశారు. అనంతరం తమ గ్రామ దేవతలకు నైవేధ్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

నిత్యావసర ధరలు నియంత్రించాలని నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యావసర ధరలు నియంత్రించాలని, కూరగాయల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేస్తూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం త్రీటౌన్ ప్రాంతంలోని రైతుబజార్ ఎదుట ధరలు నియంత్రించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలతోనే సామాన్యులపై ధరల భారం పెరిగిందన్నారు. పదవులు కాపాడుకోవడం తప్ప ప్రజలను పట్టించుకునే స్థితిలో ప్రజాప్రతినిధులు లేరని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, రవీందర్, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో చురుగ్గా వసతుల కల్పన

- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రూ.2.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం



మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని 12, 16, 23, 44, 7వ డివిజన్లలో రూ.2.60 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల కోట్ల నిధులతో నగరాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎస్‌డీఎఫ్ నిధులతో నగరంలో 32 కిలోమీటర్ల మేర సీసీ కాల్వలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం కార్పొరేటర్లు మేడారపు వెంకటేశ్వర్లు-శోభారాణి, నాగబత్తిని ప్రసాద్-నీరజ, ఆళ్ల అంజిరెడ్డి-నీరీష సమకూర్చిన కుట్టు మిషన్లను 81మంది పేద మహిళలకు మంత్రి పువ్వాడ అందజేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ ఎంఈ కృష్ణలాల్, డీఈలు స్వరూపరాణి, నవ్యజ్యోతి, రంగారావు, ఏఎంసీ చైర్మన్ దొరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు, మేడారపు వెంకటేశ్వర్లు, మగ్బూల్, పాలెపు విజయ, నాగండ్ల కోటి, దండా జ్యోతిరెడ్డి, నాయకులు పగడాల నాగరాజు, బ్రహ్మ రెడ్డి, సత్యాల మధు, అంజిరెడ్డి, భిక్షం, లింగనబోయిన లక్ష్మణ, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం నాయకుల వినతి..



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: డోర్నకల్ – మిర్యాలగూడెం రైల్వేలైన్ అలైన్‌మెంట్ మార్పునకు సహకరించాలని కోరుతూ రైతులతో కలిసి అఖిల పక్షం నాయకులు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కోరారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పాపటపల్లి నుంచి దారేడు, పడమటితండా మీదుగా మిర్యాలగూడెం వరకు రైల్వేలైన్ నిర్మిస్తే 58 కి.మీ. నిడివి ఉండగా.. పందిళ్లపల్లి, మోటమర్రి వరకు ఉన్న రైల్వేలైన్‌ను మిర్యాలగూడెం తీసుకెళ్తే 26 కి.మీ.లోనే పూర్తవుతుందని చెప్పారు. దీంతో స్పందించిన మంత్రి రైతులకు నష్టం కలగకుండా చూస్తానని పేర్కొన్నారు. నాయకులు గుర్రం అచ్చయ్య, పుచ్చకాయల కమలాకర్, పుచ్చకాయల సుధాకర్, పట్టాభి, పుచ్చకాయల మాధవరావు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేత సరికాదు..



సమావేశంలో మాట్లాడుతున్న దండా లింగయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: వెలుగుమట్లలో పేద ప్రజల ఇళ్లను బలవంతంగా కూల్చి వేయడం సరైంది కాదని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య అన్నారు. మంగళవారం ఆయన ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓపీడీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బజ్జూరి నర్సిరెడ్డి, నాయకులు నూకలమల్లయ్య, జంగం రామచందర్, గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు గంగమ్మ, షేక్ హనీఫాతో కలిసి మాట్లాడారు. డబుల్‌బెడ్‌రూం ఇస్తామని అనునిత్యం ప్రచారం చేసుకున్న ప్రభుత్వం ఇక్కడ 62 ఎకరాల 7 కుంటల భూదాన భూమి ఉందని, ఈ భూములపై గత ఎనిమిదేళ్లుగా పేదలు హక్కులు సంపాదించుకొని ఇళ్లు కట్టుకుంటే శనివారం నిర్దాక్షిణ్యంగా ఇళ్లను తొలగించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అక్రమ అరెస్టులు వెంటనే ఆపేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో దశరథ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన రైతాంగ పోరాటాలు



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

కూసుమంచి: ఎన్నో పోరాటాలకు రైతాంగ పోరాటాలు స్ఫూర్తి నింపాయని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యాన మండలంలోని మల్లేపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో పోతినేని మాట్లాడుతూ.. పోరాటాల ద్వారా కమ్యూనిస్టులు రైతులకు అండగా నిలిచి 10లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిందన్నారు. రైతులు తమ హక్కులను సాధించేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, రాష్ట్ర నాయకులు బండి రమేష్, గుడవర్తి నాగేశ్వరరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోటకూరి రాజు, బిక్కసాని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.